# ఒక మామూలు కథ

కె. వసంత

రాంబాబుని అందరూ అదోరకం మనిషి అంటుంటారు

ఆ ఏమ్మనిషిలే! ఊరంతా ఓ దారైతే ఉలిపికట్టెదో దారన్నట్టుంటాడు అని అతనిపంథా నచ్చని వాళ్ళు అంటుంటారనుకోండి!

అంతెందుకు వాళ్ళ నాన్నే మావాడు అందరిలాంటివాడు కాదోయ్ అని అనేక సందర్భాల్లో అన్నట్టు దాఖలాలున్నాయి

నిజమే మరి చిన్నప్పుడు కొనుక్కోమని డబ్బులిస్తే దాచి నెల చివర్లో తల్లికిచ్చేసేవాడు టెన్త్‌క్లాస్ చదివేటప్పుడు అందరూ ట్యూషన్ చెప్పించుకున్నా తనుమాత్రం క్లాసులో లెక్కల మాస్టార్ని ఎవడికోసం చెబుతావన్నట్టు ఒకటికి పదిసార్లు అడిగి విసిగించి చెప్పించుకునేవాడు తండ్రి నచ్చచెప్పబోతే వీళ్ళు క్లాసులో సరిగా చెబితే ఇంక ట్యూషన్లెందుకు నాన్నా అనేవాడు

ఇంటర్‌లో క్లాసు తెచ్చుకుని కూడా ఆర్థికంగా తండ్రిపడే కష్టాన్నీ పెద్దకొడుకుగా తన బాధ్యతనీ గుర్తించి డిగ్రీకోసం పాకులాడకుండా సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ కెళ్ళాడు

ట్రైనింగ్ అయిన సంవత్సరం వరకూ రాంబాబుకి ఉద్యోగం రాలేదు అయినా అతను నిరాశపడలేదు పోనీ ఓ అయిదారువేలు ఎక్కడన్నా తెచ్చి మున్సిపాలిటీలో టీచరు ఉద్యోగం కొనిపెడతానని తండ్రి బ్రతిమాలినా వినలేదు

చస్తే లంచం ఇవ్వను ఇంక నేను కష్టపడి చదివిన ఫలితమేముంది? అని భీష్మించుక్కూచున్నాడు

రుద్రపురంలో ట్యుటోరియల్ కాలేజీలకు కొదవలేదు ఓ ట్యుటోరియల్ కాలేజీలో పనిచేస్తూ సాయంత్రాలు ట్యూషన్ చెబుతూ తండ్రికి సహాయపడసాగాడు ఓప్రక్క ప్రైవేటుగా బి ఎ చదువుతూ

అలాంటి అందరిలాంటి వాడు కాని రాంబాబుకి ఎలాగైతేనేం ఇప్పుడు ఉద్యోగం వచ్చేసింది జడ్ పి సెలక్షన్సులో తమ రుద్రపురం సమితిలోనే సెకండరీగ్రేడు టీచరుగా

రాంబాబు ఆనందానికి అంతేలేదు

కాదామరి! లంచం లేందే కొంచెం ఆప్యాయతయినా దొరకని ఈ రోజుల్లో లంచం ఇవ్వరాదు పుచ్చుకోరాదు" అనే కఠిన నియమంగల రాంబాబుకి ఉద్యోగం రావడం అంటే మాటలా!?? పైగా ఇంకో ఆరునెలల్లో తండ్రి రిటైరవబోతున్నాడు కూడాను ఇంట్లో అందరూ పండగచేసుకున్నారు

పోస్టింగ్ ఆర్డర్స్ కోసం సమితి ఆఫీసుకెళ్ళాడు రాంబాబు ఇ వో (ఎడ్యుకేషన్) దగ్గర కెళ్ళి నమస్కారం పెట్టి తను వచ్చిన పని చెప్పి చేతిలోని కాగితం అందించాడు ఆయన ఆ కాగితాన్ని ఓసారి పరిశీలించి తన ప్రక్కన నిలబడివున్న ప్యూన్‌కేసి సాభిప్రాయంగా చూసి చేతిలో కాయితాన్ని తిరిగి రాంబాబు కిచ్చేసి ఎదుట కూర్చున్నవాళ్ళతో మాటలు సాగించాడు

ప్యూన్ రాంబాబుని తనతో రమ్మన్నట్టు సైగచేసి ముందుకు నడిచాడు ఈ ఆఫీసులో వాళ్ళు చాలా రిజర్వుడు టైపులా ఉన్నారే అనుకుంటూ అనుసరించాడు రాంబాబు

ప్యూన్ రాంబాబుని ఓ టేబుల్ దగ్గరకు తీసుకెళ్ళి ఆ కుర్చీలో వున్నతనితో సత్యమూర్తిగారూ! ఇ వో గారు పంపించేరండీ అని రాంబాబుని చూపించి తన దారిన వెళ్ళిపోయాడు ఆ సత్యమూర్తి అనే అతని వెనుకవైపు గోడమీద ఇ2 క్లర్క్ అని ఓ కాగితం మీద పెద్దక్షరాలతో వ్రాసి అంటించివుంది

సదరు సత్యమూర్తి ప్యూన్ మాటలకు చూస్తున్న ఫైల్లోంచి తలెత్తి రాంబాబుకేసి ఎగాదిగా చూశాడు

రాంబాబు ఆ చూపుకి కంగారుపడి చప్పున ఇదిగో నండి అంటూ తన చేతిలోని కాగితం అందించాడు

*   *   *

ఆ ఇప్పుడు చెప్పవయ్యా! నిన్నెక్కడ వెయ్యమంటావ్? ఏ చోటయితే నీ కనుకూలంగా ఉంటుందంటావ్?

సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు సత్యమూర్తి

ఆఫీసు ఆవరణలోని చెట్టుక్రింద వున్న బెంచీమీద కూర్చుని ఉన్నారిద్దరూ రాంబాబు కేం మాట్లాడాలో తెలీలేదు అతనికిదంతా క్రొత్త

మళ్ళీ సత్యమూర్తే మాట్లాడేడు

వెంకటపాలెంలో ఓ ఖాళీ ఉంది కాని చాలా దూరం బస్సుదిగి మూడు మైళ్ళు నడిచి కాలవ దాటివెళ్ళాలి పైగా సింగిల్ టీచరు స్కూలు

అప్పటికి మాట్లాడేడు రాంబాబు

అవునండీ! ఆ వెంకటపాలెం ప్రయాణం ఎంత కష్టమో నా కోసారి అనుభవమైంది ఓ స్నేహితుడి పెళ్ళికి ఆ ఊరెళ్ళాల్సి వచ్చింది ఇంటికొచ్చాక రెండ్రోజులు లేవలేకపోయాను ఇంక అక్కడ ఉద్యోగమంటే నవ్వాడు సత్యమూర్తి అభయం ఇస్తున్నట్టుగా ఉందా నవ్వు

ఇకపోతే పద్మా నగర్‌లో రెండు ఖాళీలున్నాయి అక్కడైతే నీకు చాలా హాయి మెయిన్ రోడ్డు ప్రక్కనే స్కూలు బస్సుకైనా వెళ్ళచ్చు లేదా పావుగంటలో సైకిల్‌మీదయినా వెళ్ళచ్చు ఏమంటావ్? రాంబాబేమంటాడు క్రొత్తగా ఉద్యోగంలో చేరుతున్న తన మంచి చెడులు ఆలోచించి తనకు ఇబ్బంది లేకుండా చేయాలని చూస్తున్న సత్యమూర్తి పట్ల ఆ క్షణంలో ఎక్కడలేని గౌరవం కలిగిందతనికి

కంఠం పూడుకు పోతుండగా అలాగే ఇంట్లో నేను పెద్దవాడ్ని నాన్నగారికి అనారోగ్యం పైగా ప్రైవేటుగా బి ఎ చదువుతున్నాను పద్మా నగరైతే నా కెంతో సదుపాయంగా ఉంటుంది మీమేలు మరచిపోను మనస్ఫూర్తిగా అన్నాడు

ఆప్యాయంగా నవ్వాడు సత్యమూర్తి దానిదేముంది అన్నట్టు మన సమితికి నీతోబాటు మరో ఇద్దరు కూడా ఎలాటయ్యారుగా నువ్వు వాళ్ళకంటే ఒకపూట ఆలస్యంగా జాయినయినా సీనియారిటీ తగ్గుతుంది ఈరోజే పోస్టింగ్ ఆర్డర్సు తీసుకుని రేపు జాయినైపో మరి మరి ఇక

ఏమిటిసార్?

అదే మరి ఓ రెండొందలిలా పడేయి మిగతా విషయాలు చూస్తాను

మాట్లాడవేమయ్యా

అప్పటికి షాక్‌నుండి తేరుకున్న రాంబాబు

లంచమా ?

మొహం చిట్లించాడు సత్యమూర్తి ఇందాకటి సౌమ్యత అతని మొహంలో గుర్తు తెలీకుండా మాయమైంది


లంచమేమిటి?! ఆ పద్మానగర్‌కి ఎంత పోటీ వుందో తెలుసా? అయినా ఆ రెండొందలూ నా ఒక్కడికే అనుకున్నావా? పెద్దోళ్ళకి పంచొద్దూ! నాకు మిగిలి చచ్చేదేం లేదు ఏదో పాపం బీదవాడిలా ఉన్నావని

ఈ విషయం బి డి వో కి రిపోర్టు చేద్దామా అని ఆలోచిస్తున్న రాంబాబు ఈ మాటల్తో మరింత బిత్తరపోయాడు అందరూ ఒకటే అయితే ఇంకెవరికి చెప్పుకోవాలి!

ఏమయినాసరే నేను మాత్రం డబ్బివ్వను

నిష్కర్షగా చెప్పేశాడు ఇన్నాళ్ళు ఎన్ని కష్టాలయినా ఓర్చి కాపాడుకున్న నియమాన్ని యిప్పుడు తీరా ఉద్యోగం వచ్చాక వదులుకుని ఆత్మవంచన చేసుకోడం రాంబాబుకి యిష్టం లేకపోయింది

సరే నీ యిష్టం విసురుగా లేచి వెళ్ళిపోయాడు



సత్యమూర్తి

తర్వాత ఏవేవో కారణాలవల్ల రాంబాబుకి పోస్టింగ్ ఆర్డర్సు రావడం రెండురోజులు ఆలస్యమైంది మిగిలిన ఇద్దరి కంటే రాంబాబు రెండురోజులు ఆలస్యంగా జాయినయ్యాడు వెంకటపాలెంలో

మూడేళ్ళు గడిచిపోయ్యాయి

ఈ మూడేళ్ళూ రాంబాబు పడిన కష్టాలు చెప్పనలవికాదు అందరికీ సకాలంలో వచ్చే డి ఎ ఎరియర్స్ మొదలైనవి అతను ఆఫీసు చుట్టూ ఓ యా భైసార్లన్నా తిరిగితే కానీ రావు అతను పంపించే బిల్లులు వగయిరాల్లో ఏదో ఓ తప్పు దొరుకుతూనే ఉంటుంది బిల్లులు చూసే క్లర్కుకి అతనితో పాటు అపాయింట్ అయిన యిద్దరికీ ప్రొబేషన్ డిక్లేర్ అయినా ఇతనికి ఇంకా కాలేదు పైగా వెంకటపాలెంలో ఉద్యోగం అక్కడ ఉండేందుకు బొత్తిగా వీలుకాని ఊరు అలాగని రోజూ ప్రయాణం అసలే అసాధ్యం

రాంబాబులాంటి నిజాయితీగా ఉద్యోగం చెయ్యాలనుకునే ఉద్యోగికి అంతకంటే శిక్ష లేదు రాంబాబు ఈ కష్టాన్ని ఎలాగో భరించదలచుకున్నాడు కాని ఇంతలో అతనికి అనుకోని పెద్ద కష్టం వచ్చి పడింది

అతని తండ్రి హఠాత్తుగా గుండెనొప్పితో చనిపోయాడు ఇది అతనికి తట్టుకోలేని దెబ్బ కనీసం బజారు మొహం తెలీని తల్లి ఇంకా రెక్కలు రాని తమ్ముళ్ళు చెల్లెళ్ళు ఒక కొలిక్కి రాని కుటుంబ వ్యవహారాలు

రాంబాబుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడం తప్పనిసరైంది కానీ ఆ కాస్త ముడుపూ చెల్లించందే అది సాధ్యమయ్యేలా లేదు

ఎదురైన ప్రతి వాళ్ళు ఒకటే సలహా ఎన్నాళ్ళిలా తిప్పలు పడతావు?! ఎంతో కొంత వాళ్ళ మొహాన పడేసి గండం దాటరాదా?!

ఆ రోజు ఆదివారం తండ్రి పడుకునే ఈజీ చెయిర్లో పడుకొని దిగులుగా పై కప్పుకేసి చూస్తున్నాడు రాంబాబు

తన పరిస్థితి తలచుకున్నకొద్దీ అతనికి పిచ్చెక్కేలా ఉంది దుఃఖం తన్నుకొస్తోంది

అమ్మయ్య! ఇంట్లోనే ఉన్నావటోయ్!? అంటూ వచ్చారు సుబ్బయ్య మాస్టారు ఆయన కూడా సమితిలో టీచరే తండ్రికి స్నేహితుడు కూడా

కూర్చోండి

ఇప్పుడే నాకో విషయం తెలిసిందోయ్

నిరాసక్తంగా చూశాడు రాంబాబు

ఈ నెల పదిహేను వరకే ట్రాన్స్‌ఫర్లకి వీలుందట అంటే ఇంక వారం రోజులే ఆ తర్వాత ఏడాది వరకూ వీలు కాదుట

రాంబాబు ఏం మాట్లాడలేదు

కానీ తన మనసులోని ఆందోళనంతా అతని మొహంలో ప్రతిఫలిస్తోంది నచ్చ చెపుతున్నట్టుగా అన్నారు సుబ్బయ్య మాస్టారు నువ్వు తొందరపడకపోతే లాభం లేదోయ్ చూడు సిద్ధాంతాలతో కడుపులు నిండుతాయా!? ఒక్కసారి నీ తల్లితో బుట్టువుల మొహాలు చూడు నువు దగ్గరుండి చూసుకోకపోతే ఈ ఇల్లేమై పోతుంది?! ఎల్లలు పాడైపోరూ?! సత్యమూర్తితో నేను మాట్లాడ్తాను ఓ నాలుగొందలు నీవి కావనుకో

"పోనీ నీకు మొహమాటమైతే చెప్పు నేనే సెటిల్ చేస్తాను

మాట్లాడవేమోయ్

భారంగా నిట్టూర్చాడు రాంబాబు తర్వాత మెల్లిగా వణికే స్వరంతో అన్నాడు

అలా గే మీయిష్ట ప్రకారమే కానీండి

అంతే

ఆ తర్వాత చెప్పడానికేమి లేదు

మావాడు అందరిలాంటి వాడు కాదని చెప్పడానికి ఇప్పుడతని తండ్రి లేడు

మిగిలిన వాళ్ళెవరూ అలా అనరు

ఎందుకంటే

ఇప్పుడతను అందరిలాంటి వాడే □